## క్లుప్తంగా

### వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వంద మంది పారిశుధ్య కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య, ఆరోగ్య శిబిరంలో వైద్యాధికారి మాధవి ఆధ్వర్యంలో కార్మికులకు ఆస్పత్రి వైద్యులు, నర్సులు పరీక్షలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, శారదా దేవి, శ్రీలక్ష్మీ, పద్మజ, ప్రశాంతి కోఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివ కుమార్ పాల్గొన్నారు.

### హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్... బెళుగుప్ప: బూదిగుమ్మలోని హనుమంతురాయ స్వామి, పద్మావతి వెంకటరమణస్వామి ఆలయాల శాశ్వత హుండీలను సోమవారం ఈఓ అక్కిరెడ్డి, పర్యవేక్షణ అధికారి బాబుల ఆధ్వర్యంలో లెక్కించారు. హనుమంతురాయస్వామి ఆలయ హుండీ నుంచి రూ.51,713, శ్రీపద్మావతి వెంకటరమణస్వామి ఆలయ హుండీ నుంచి రూ.32,421 నగదు వచ్చింది. గ్రామపెద్దలు సేవా కమిటీ సభ్యులు అర్చకులు జ్ఞానేశ్వర్, వాసేదేవ తదితరులు పాల్గొన్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

బొమ్మనహాళ్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. మండలంలోని ఉద్దేహాళ్ సమీపంలోని వేదావతి హగరి నది నుంచి సోమవారం ఉదయం ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఉద్దేహాళ్, నేమకల్లు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి గ్రామప్రజలకు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగమణి, ఈఓఆర్డీ సురేష్ బాబు, సర్పంచ్ విజయలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, ఉపాధి ఏపీఓ సురేశ్, వెలుగు ఏపీఎం కళానాయక్ పాల్గొన్నారు.

### రుచికరమైన భోజనం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగమణి

గుమ్మఘట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా అందించాలని ఎంఈఓ నాగమణి తెలిపారు. మండలంలోని బీటీపీలోని కేజీబీవీని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం పాఠశాలల్లో గదులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ షబానాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం అర్బన్ సీఐ గట్టి చర్యలు చేపడుతున్నారు. వ్యాపారులు డ్రైనేజీలతోపాటు ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, ఇతర సామగ్రి ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ , పార్కింగ్ సమస్య అధికమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పరిధి ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుంటే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. పార్కింగ్‌కు, ట్రాఫిక్ సమస్యకు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలే గానీ రోడ్లపైకి వచ్చి అడ్డంకి కలిగిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

### పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్, బండూరు గ్రామాల్లో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యుగంధర్, రుక్మిణీ, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, విజయలక్ష్మి, నాగమణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ జూదం.. ప్రాణాలతో చెలగాటం



- పెడదోవపడుతున్న యువత
- అప్పులపాలై ఆస్తులు అమ్ముకుంటున్న వైనం
- రాయదుర్గంలో వ్యసనానికి బానిసవుతున్న యువకులు

రాయదుర్గం పట్టణానికి చెందిన ఓ మొక్కల వ్యాపారి ఆన్‌లైన్ జూదానికి బానిసయ్యాడు. తన సతీమణి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆమె ఖాతాకు ఇతడి సెల్‌ఫోన్ లింకైంది. సులభంగా రోజుకు రూ.3 వేలు సంపాదిస్తున్నానని సంబరపడ్డాడు. ఉన్నట్టుండి తన భార్య సెల్‌కు రూ.10 లక్షలు క్రెడిట్ మెస్సేజ్ వచ్చింది. బ్యాంకులో విచారిస్తే ఆన్‌లైన్ జూదం కొంప ముంచిందని తెలుసుకున్నారు. పంచాయితీ కాస్త పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. ఇటీవల పోలీసులు సర్దిచెప్పి పంపారు.

పట్టణంలోని ఇద్దరు విద్యార్థులు మిత్రులు. ఒకరు స్థానికంగా పార్సెల్ సర్వీస్‌లో, మరొకరు బెంగళూరులోని ఓ కాల్ సెంటర్‌లో ఇటీవల విధుల్లోకి చేరారు. కాల్‌సెంటర్‌లో ఉండే విద్యార్థి ఆన్‌లైన్ జూదానికి బానిసై అప్పుల పాలయ్యాడు. జూదం కోసం డబ్బు అవసరమై తన మిత్రుడి ఖాతాకు కన్నం వేశాడు. ఓ లింకుద్వారా రూ.25 వేలు కాజేసి ఆన్‌లైన్‌లో జమ చేశాడు. ఇలా ఈ రెండు చోట్లే కాదు..ఆన్‌లైన్ జూదం ఆడేవారి సంఖ్య పెరుగుతున్నట్టే మోసపోయే బాధితుల సంఖ్య కూడా ఎక్కువవుతోంది. అప్పులు పాలై కొందరు ఆస్తులు పోగొట్టుకోగా, మరి కొందరు ప్రాణాలే వదిలారు.



రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న కొన్ని సంఘటనలే దీనికి నిదర్శనం. పల్లె, పట్టణాల విద్యార్థులు ఈ జూద వలలో చిక్కుకుని భారీ నష్టపోతున్నారు. రెట్టింపు డబ్బు వస్తోందనే ఆశతో అధిక మొత్తంలో జమ చేస్తుంటారు. 15 శాతం కమీషన్ రూపంలో ఆన్‌లైన్ కంపెనీలు లాగేసుకుంటాయి.

**జీవితాలను తలకిందలు చేస్తున్న జూదం..**

ఆన్‌లైన్ బెట్టింగ్ ఎందరో జీవితాలను తలకిందలు చేస్తున్న ఓ జూదక్రీడ. సామాన్య, మధ్య తరగతి వర్గాల నుంచి ధనవంతుల వరకు, యువత నుంచి మధ్య వయసు వరకు ఎందరో దీని బాధితులే. సులభంగా డబ్బు సంపాదించొచ్చని, అదృష్టం వరిస్తే..లక్షాధికారులు కావొచ్చని.. చిన్న మొత్తం వెచ్చించి .. పెద్ద మొత్తం లో డబ్బు సమకూరితే కష్టాలు తొలగిపోతాయని భావిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దిగుతున్నారు. క్రమంగా ఇదో వ్యసనంగా మారిపోయి ఇల్లు, ఒళ్లు గుల్లచేసుకుంటున్నారు. తీర్చలేనంత అప్పు చేసి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

**వ్యసనంగా మారి .. నష్టాలు చవిచూసి..**

ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్ ఫోన్‌లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. నెట్ సేవలు సులభంగా అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్‌లో ఆటలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. రూ.వందలతో మొదలై రూ.వేలు, రూ. లక్షలు చేతులు మారిపోతున్నాయి. ఫోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి చెల్లించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంధువులు, మిత్రులకు అసభ్యంగా ఉండే చిత్రాలను మార్ఫింగ్ చేసి పంపుతున్నారు. పరువు కాపాడుకునేందుకు అప్పులు చేసి, రుణాలు చెల్లిస్తున్నారు.

**సులభంగా సంపాదించాలని..**

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ, లోడో, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లు చేస్తున్నారు. మొదట సరదాగా మొదలు పెట్టిన వాళ్లు చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనికి తోడు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు చాలానే ఉన్నాయి. వీటిపై వల పన్నినా సైబర్ నేరగాళ్ల ఖాతాలను యాక్‌చేసి డబ్బంతా లాగేసుకుంటున్నారు.

#### పిల్లలపై నిఘా ఉంచాలి



పిల్లల నడవడికపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. వారికి అనవసరంగా డబ్బు, సెల్‌ఫోన్లు ఇవ్వడం మంచిది కాదు. ఆన్‌లైన్‌లో వివిధ రకాల మోసపూరిత గేమ్‌లు ఉంటాయి. ఆగేమ్‌లకు అలవాటుపడి బెట్టింగ్‌లపై దృష్టి సారిస్తున్నారు. సరదాగా జూదం అంటూ ఆ తర్వాత వ్యసనంగా మార్చుకుంటున్నారు. అలాంటి వారిని గుర్తించి తమకు అప్పగిస్తే కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకొస్తాం. సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ జూదగాళ్ల ఆట కట్టించేలా చర్యలు చేపడతాం.

– జే జయానాయక్, అర్బన్ సీఐ, రాయదుర్గం

### ‘తమ్ముళ్ల’ కుమ్ములాట

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి వందరోజులయ్యింది. దీంతో ‘ఇది మంచి ప్రభుత్వం’ అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. సోమవారం మండలంలోని బోరంపల్లిలో టీడీపీ నాయకులు, అధికారులు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహిస్తుండగా, పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించే సమయంలో టీడీపీకి చెందిన మల్లయ్య, ఎర్రిస్వామి, తిప్పయ్య, రమేష్ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గ్రామంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెత్తం దార్లదే సాగుతోందని పలువురు టీడీపీ నాయకులు టీడీపీ నాయకులే వాపోయారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేస్తున్నారు.

### డిమాండ్లు తీర్చాలని ఏఎన్‌ఎంల నిరసన

కూడేరు: న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించకపోతే సామూహిక సెలవుపై వెళ్తామని కూడేరు మండలంలోని సచివాలయాల ఏఎన్‌ఎంలు హెచ్చరించారు. సోమవారం సచివాలయ ఏఎన్‌ఎంలు భాగ్యలక్ష్మి, సుజాత, చంద్రకళ, వసుంధర, త్రివేణి, మాధవి, రాధిక, భాను, సుశీల, సావిత్రి విలేకరులతో మాట్లాడారు. ఆర్‌సీహెచ్ ఆన్‌లైన్ వర్క్‌కు సంబంధించిన ఇన్సెంటివ్‌ను తమ ఖాతాలకు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు.

### మొబైల్ షాప్‌ల బంద్ ప్రశాంతం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో సోమవారం మొబైల్ షాప్‌లు బంద్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని టీ సర్కిల్‌లో ఉన్న హోల్‌సేల్ షాప్ యజమాని సెల్‌ఫోన్ల పరికరాలు హోల్‌సేల్ ధరలకే విక్రయిస్తుండడంతో చిన్న మొబైల్ షాపుల యజమానులు నష్టపోతున్నారని మొబైల్‌షాపు యజమానులు అన్నారు. సోమవారం పట్టణంలోని సుమారుగా 250 మొబైల్ షాప్ యజమానులు షాప్‌లను బంద్‌చేసి డీఎస్పీ రవిబాబుకు ఫిర్యాదు చేశారు.

### విద్యార్థికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురంలో బీఎస్సీ చదువుతున్న పట్టణానికి చెందిన మేఘన అనే విద్యార్థిని చదువు కోసం ఆంధ్ర బ్యాంకు ఉద్యోగి లోకేష్ రూ.17వేలు ఆర్థిక సాయం చేశారు. చెక్కు విద్యార్థిని తండ్రి జ్ఞాన సుందర్‌కు సోమవారం అందించారు.

## వ్యవసాయ కార్యక్రమాల్లో సహాయకారిగా ఉండండి



కొనకొండ్లలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఆహ్వానిస్తున్న ఏఓ మధుకర్

వజ్రకరూరు: రైతులకు అందుబాటులో ఉంటూ వ్యవసాయ కార్యక్రమాల్లో సహాయకారిగా ఉండాలని వ్యవసాయాధికారులకు ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి సూచించారు. మంగళవారం నుంచి వ్యవసాయశాఖ ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహిస్తోంది. దీంతో మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఎమ్మెల్సీని ఏఓ మధుకర్, ఉరవకొండ నియోజకవర్గ వ్యవసాయాధికారులు కలిశారు. ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమ షెడ్యూల్, వివరాలను ఎమ్మెల్సీకి అందించి, ఆహ్వానించారు. అనంతరం వ్యవసాయాధికారులు మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా గ్రామాల్లోని రైతులకు ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి పంటలు సాగు చేయాలి.. దిగుబడి ఏ పంట అధికంగా వస్తుంది తదితర అంశాలపై రైతులను గ్రామ సభల ద్వారా చైతన్య పరచనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామసభల్లో వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, హార్టికల్చర్, ఫిషరీస్ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు, పంట కొనుగోలుదారులు పాల్గొనున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులకు ఎమ్మెల్సీ పలు సూచనలు అందించారు. నేల రకాన్ని బట్టి ఏ పంటలు సాగు చేస్తే దిగుబడి వస్తుందో.. వర్షాలకనుగుణంగా పంటలు సాగు చేసుకునేలా శాస్త్రవేత్తల ద్వారా రైతులకు తెలియజేయాలని సూచించారు.

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కంబదూరు: కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ వనజ అక్కమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శెట్టూరు మండలంలోని చిన్నంపల్లి–1(బీసీ–ఈ), ఐదుకల్లు (ఎస్సీ), మలయనూరు–1(ఎస్సీ), కొత్తమిద్దెల (ఓసీ), కంబదూరు–5 (బీసీ–బీ), దేవేంద్రపురం (ఓసీ), కుందుర్పి మండలంలోని కరిగానిపల్లి–1(ఓసీ) గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు రిజర్వేషన్ల ప్రకారం దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల 1లోపు కంబదూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఉరవకొండ: ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 11 అంగన్‌వాడీ హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఉరవకొండ ఇన్‌చార్జ్ సీడీపీఓ, పీడీ శ్రీదేవి సోమవారం కోరారు. విడపనకల్లు మండల పరిధిలోని హావళిగి, గడేకల్లు, పాల్తి, విడపనకల్లు, బెళుగుప్ప మండలం యలగలవంక, ఉరవకొండ మండలంలోని ఉరవకొండ–12, ఉరవకొండ–2, కూడేరు మండలం గొట్కూరు లో మిని అంగన్‌వాడీ కార్యకర్త, ఉదిరికొండతండా, చోళసముద్రం, కలగల్లలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

## ఏపీ హెచ్‌ఎంఎంఎస్‌ఏ అధ్యక్షుడికి సన్మానం

ఉరవకొండ: రాకెట్ల పీహెచ్‌సీలో పనిచేస్తున్న సీనియర్ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండీ షఫీ ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. సోమవారం రాకెట్ల పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు షఫీ మాట్లాడుతూ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆరవపాల్, ఉపాధ్యక్షులు మల్లెపల్లె పాపన్నతోపాటు తనకు ఎంపికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఏఐఎస్‌ఎఫ్ మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు

రాయదుర్గంటౌన్:విజయనగరంలో ఈనెల 27,28,29,30 తేదీల్లో నాలుగు రోజుల పాటు జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక యూనియన్ సహాయ కార్యదర్శి అంజనేయులుతో కలిసి మాట్లాడారు. మహాసభల్లో పలు విద్యా రంగ సమస్యలపై పోరాట ప్రణాళికపై చర్చించనున్నట్లు చెప్పారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కాలవ, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



గిరిజనుల నృత్యం తిలకిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కాలవ

డీ హీరేహాళ్ (రాయదుర్గం): ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం డీ హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లిలో ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తామన్నారు. అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. మండల స్థాయిలోనే ముఖ్యమైన వంద సేవలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. అనంతరం పీఆర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.30 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. రాయదుర్గం అభివృద్ధికి తప్పక పాటుపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాణీ సుష్మిత, తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**పెట్టుబడి సాయం వెంటనే అందించాలి**

వజ్రకరూరు: ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందించాలని సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పెట్టుబడిసాయం విడుదల చేయడంతోపాటు 2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలని, వ్యవసాయపంపు సెట్లకు స్మార్టు మీటర్లు బిగించొద్దని కోరుతూ తహసీల్దార్ నయాజ్‌అహమ్మద్‌కు వినతిపత్రం అందించారు.మండల నాయకులు సుదాకర్, నాగేంద్ర, శివ, ఆంజనేయులు, నారాయణస్వామి, బాషా, మద్దిలేటి,భూషి త దితరులు పాల్గొన్నారు.

**ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేయండి**

కూడేరు: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని హెల్త్ సూపర్‌వైజర్లు యశోద, రవీంద్ర సూచించారు. సోమవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో వారు సమావేశమయ్యారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా అవగాహన కల్పించి చైతన్య పరచాలని తెలియజేశారు. సీఎస్‌ఎస్‌ఎం, హెచ్‌ఐఎస్, మలేరియా, టీబీ, కుష్టు , ఆర్‌సీహెచ్, ఎంసీహెచ్‌కు సంబంధించిన రిపోర్టులను పక్కాగా తయారు చేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**మహా ధర్నా బుక్‌లెట్ల విడుదల**



మహాధర్నా బుక్‌లెట్లను విడుదల చేస్తున్న నాయకులు

రాయదుర్గంటౌన్: స్థానిక బీఎస్పీ కార్యాలయంలో అక్టోబర్ 9న విజయవాడలో జరగనున్న మహాధర్నా బుక్‌లెట్లను సోమవారం విడుదల చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో మహాధర్నా చేస్తున్నట్లు తెలిపారు. బీఎస్పీ నాయకులు జానకీరామ్, ఉలిగప్ప పాల్గొన్నారు.

**రైతులకు బీమా మంజూరు చేయండి**

కణేకల్లు: గతేడాది ఖరీఫ్, రబీలో వర్షాభావ పరిస్థితులతో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే బీమా మంజూరు చేయాలని కణేకల్లు మండల రైతు సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సీపీఎం మండల కన్వీనర్ కోరి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. రైతులతో కలిసి తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

**రేషన్ సక్రమంగా అందించాలి**

కూడేరు: కార్డుదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని ఇన్‌చార్జ్ సీఎస్‌డీటీ విజయకుమార్ ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సరుకుల పంపిణీపై డీలర్లతో ఆయన మాట్లాడారు. నూతనంగా డీలర్‌షిప్ తీసుకున్న వారు ఈ–పాస్ మిషన్ నిర్వహణపై శిక్షణ తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు సరుకులు పంపిణీ జరగాలని, కార్డుదారుల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# రెచ్చిపోతున్న భూ అక్రమార్కులు

- వంకలు, వాగులను కబ్జా చేస్తున్న వైనం
- చెరువు కాలువ సైతం పూడ్చివేసి తమ ఖాతాలో వేసుకునేందుకు యత్నం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



కాలువ సమీపంలో కంచె ఏర్పాటు చేసిన అక్రమార్కులు



కాలువను మళ్లించేందుకు అక్రమంగా తవ్విన దృశ్యం

కంబదూరు: భూముల కొనుగోలు పేరుతో కొందరు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. వంకలు, వాగులను కబ్జా చేస్తున్నారు. వారు కొనుగోలు చేసిన భూముల సమీపంలో ఉండే వంకలు, వాగులు, ప్రభుత్వ స్థలాను యథేచ్ఛగా కబ్జా చేస్తూ, కంచె వేస్తున్నారు. ఇదంతా మాభూమే అని చెప్పుకుంటున్నారు. చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువలను సైతం పూడ్చేసి తమ ఖాతాలోకి వేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఇంతా జరుగుతున్న అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది.

మండల కేంద్రంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న కంబదూరు చాకలిరేవు, ఒంటారెడ్డిపల్లి, అండేపల్లి, జెల్లిపల్లి దగ్గర ఉన్న భూములను ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. భూముల కొనుగోలు పేరుతో ఆ భూములకు సమీపంలోని వంకలు, వాగులను కబ్జా చేస్తున్నట్లు ప్రజలు చెప్తున్నారు. అలాగే కంబదూరు చెరువు నుంచి ప్రారంభమయ్యే కాలువ ఒకటి చాకలిరేవు మీదుగా వెళ్తుంది. ఆ కాలువ ద్వారా వచ్చే వర్షపు నీటిని రైతులు పంటల సాగుకు ఉపయోగిస్తుంటారు. అయితే రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు భూముల కొనుగోలు ముసుగులో కాలువలను ఆక్రమించి, తమ ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమయ్యారు. కాలువను మట్టితో పూడ్చేశారు. దీంతో భారీ వర్షాలు వస్తే పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ భూముల సమీపంలో రైల్వే పట్టాలు, మల్లేశ్వరస్వామి ఆలయం ఉండడం వల్ల ఈ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టడడం చట్ట విరుద్ధమైనా విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

**పట్టించుకోని అధికారులు..**

భూముల కొనుగోలు విషయంలో గతంలో పని చేసిన రెవెన్యూ అధికారులు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వారి అండ చూసుకునే వారు ఇలా బరితెగిస్తున్నట్లు గ్రామస్తులు చెప్తున్నారు. రెవెన్యూ దస్త్రాల ప్రకారం 30 అడుగుల నుంచి 80 అడుగుల వరకు ఉండాల్సిన కాలువను అధికారుల అండ దండలతో కాలువను కుదించి, వారికి ఇష్టమొచ్చినట్లుగా కాలువను మళ్లిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఈ ఇదంతా చాలా రోజుల నుంచి నడుస్తున్నా ఇరిగేషన్, రోడ్లు భవనాల, రెవెన్యూ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు ఉన్నాయి.

#### నోటీసులు ఇస్తాం



ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు కొనుగోలు చేసినవన్నీ పట్టా భూములే. అయితే ఆ భూముల పక్కనున్న వంకలు, వాగులు, కాలువల ఆక్రమణకు గురవుతున్నట్లు ప్రజల నుంచి కూడా ఫిర్యాదులు వచ్చాయి. వెళ్లి పరిశీలించాం. వారు కూడా పట్ట భూమిలో వెళ్లిన కాలువలను మాత్రమే పక్కకు తిప్పారు. అయితే అవీ చెరువు సంబంధించిన సాగు నీటి కాలువలు కాబట్టి వాటి జోలికి వెళ్లొద్దని భూయజమానులకు నోటీసులు అందజేస్తాం. ఇరిగేషన్ అధికారులు కూడా పరిశీలిస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– బాలకిషన్ తహసీల్దార్, కంబదూరు:

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉరవకొండ: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు ఉపాధ్యాయులను ఉరవకొండ ప్రభుత్వ పెన్షనర్స్ భవన్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయులు ఆదిరాజేష్, శ్రీనివాసులు, షేక్షావలి, ఆయూబ్ ఖాన్, వెంకట్ తాడికొండ, కిష్టప్పను సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమప్ప, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకేభాస్కర్ తదితరులు మాట్లాడారు.